నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 20 జనవరి 2025 | HYDERABAD

నెలాఖరులోగా హైడ్రా పీఎస్

సిటీబ్యూరో, జనవరి 19(నమస్తే తెలంగాణ): ఈ నెల చివరి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బుద్ధభవన్‌లోని బీ బ్లాక్ మొదటి అంతస్తు మొత్తం హైడ్రా పీఎస్‌కు కేటాయించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి ఈనెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, అధికారులు పనులు స్పీడప్ చేశారు. స్టేషన్ ఏర్పాటు తర్వాత చెరువుల, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలతో పాటు ఫైర్ సేఫ్టీ వంటి వాటిపై వచ్చే ఫిర్యాదులను అనుసరించి కేసులను ఇక్కడ నమోదు చేస్తారు. అంతేకాకుండా సుమోటోగా కూడా కేసులు నమోదు చేసే అధికారం హైడ్రాకు ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు పీఎస్ ప్రారంభానికి ముందే సిబ్బంది నియామక ప్రక్రియను కూడా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. పీఎస్‌కు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఏసీపీ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగిస్తారు. పీఎస్‌కు, హైడ్రాకు పోలీస్ శాఖ నుంచి ఇప్పటికే 169 మంది సిబ్బందిని కేటాయించడానికి ఆమోదం తెలుపగా, ఇందులో ఇద్దరు నాన్ కేడర్ ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 16మంది ఇన్‌స్పెక్టర్లు, 16మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 60మంది కానిస్టేబుల్స్‌తో పాటు హోంగార్డులు, అనలిటికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అనలిటికల్ ఆఫీసర్లు ఉంటారు. మరోవైపు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందిని కూడా హైడ్రాకు కేటాయించగా మరికొంతమంది పీఎస్‌కు అటాచ్ చేయనున్నారు.

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్యారడైజ్ నుంచి మెట్రో లేనట్లే

నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో కీలక మలుపు

- జేబీఎస్ నుంచి మొదలై మేడ్చల్, శామీర్‌పేట వరకు రెండుగా చీలనున్న మెట్రో
- భవిష్యత్‌లో అతిపెద్ద జంక్షన్‌గా మారనున్న జేబీఎస్
- ప్యారడైజ్-మేడ్చల్ రూట్‌కు అడ్డంకిగా ఎయిర్‌పోర్టు

సిటీబ్యూరో, జనవరి 19(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీలో కీలకమైన ప్యారడైజ్-మేడ్చల్ మార్గంలో మార్పులపై మెట్రో దృష్టి పెట్టింది. బేగంపేట ఎయిర్‌పోర్టు మీదుగా మెట్రో లైన్ తీసుకెళ్లడంలో ఎదురవుతున్న ఇంజినీరింగ్ సాంకేతిక ఇబ్బందులు దృష్ట్యా... ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. దీంతో ఇన్నాళ్లు ప్యారడైజ్ నుంచి మెట్రో ప్రారంభమవుతుందని భావించినా... అలైన్‌మెంట్ మార్పులతో ఆ కల కనుమరుగు కానున్నది. అయితే జేబీఎస్ ప్రధాన వై జంక్షన్‌గా మారనుండగా జేబీఎస్ వద్ద రెండుగా చీలి ఒకటి మేడ్చల్ వైపు, మరోకటి శామీర్‌పేట వైపు పయనించనున్నది. ఈ మార్గంలో ఇరుకైన రోడ్లు, బేగంపేట ఎయిర్‌పోర్టు మెట్రో మార్గానికి ప్రధాన ఆటంకాలుగా మారుతుండగా... సాధ్యాసాధ్యాలపై మెట్రో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఆదివారం ఈ మార్గంలో హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఇంజినీరింగ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ మార్గంలో మెట్రో నిర్మాణం సాధ్యం కాదని, అందుకే నేరుగా జేబీఎస్ కేంద్రంగా మెట్రోను నిర్మించడమే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందని తేల్చింది.

అడ్డంకులెన్నో...

స్వల్ప మార్పులతో నార్త్ సిటీ మెట్రో మార్గానికి రూపొందించేందుకు హైదరాబాద్ మెట్రో సంస్థ సన్నాహాలు చేస్తోంది. ప్యారడైజ్-మేడ్చల్(23కి.మీ), జేబీఎస్-శామీర్‌పేట(22కి.మీ) మార్గంలో మెట్రో అలైన్‌మెంట్ ప్రతిపాదించారు. అయితే ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వెళ్లే మార్గంలో బేగంపేట ఎయిర్‌పోర్టు ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో ప్యారడైజ్ వద్ద మెట్రో స్టేషన్ కంటే... జేబీఎస్ వద్ద మెట్రో జంక్షన్ ఏర్పాటు చేస్తే సరిపోతుందని మెట్రో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషణలో భాగంగా ప్యారడైజ్ నుంచి తొలగించే అవకాశం ఉంది. వాస్తవానికి ప్యారడైజ్ నుంచి మొదలై, బేగంపేట ఎయిర్‌పోర్టు మీదుగా బోయిన్‌పల్లి వరకు రోడ్డు వంకలు తిరిగి ఉండటం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆంక్షల నేపథ్యంతో ఈ మార్గంలోనే మెట్రో నిర్మాణం సాధ్యం కాదని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును బేగంపేట ఎయిర్‌పోర్టు ఇబ్బందులతో అండర్ గ్రౌండ్ టన్నెల్ ప్రాజెక్టుగా చేపడుతున్నారు. ఇలాంటి సందర్భంలో ఎయిర్‌పోర్టు మీదుగా మెట్రో అసాధ్యమని భావించారు. ఈ క్రమంలో అండర్ గ్రౌండ్ నుంచి ఎలివేటెడ్ ప్రాజెక్టుగా చేపట్టడం అత్యంత క్లిష్టమని భావించిన మెట్రో సంస్థ... అందుకు జేబీఎస్ నుంచి మెట్రో ప్రారంభించడంపై అధ్యయనం చేస్తున్నది.

మారనున్న అలైన్‌మెంట్...

జేబీఎస్ నుంచి ప్రారంభించి సికింద్రాబాద్ క్లబ్ రోడ్డు, స్టాఫ్ రోడ్డు, మడ్‌ఫోర్ట్ రోడ్డు, టీవోలీ జంక్షన్ రోడ్డు, డైమండ్ పాయింట్ జంక్షన్, సెంటర్ పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట్ జంక్షన్ బోయిన్‌పల్లి రోడ్డు, తాడ్‌బండ్ హనుమాన్ టెంపుల్ రోడ్డు, ఎయిర్‌పోర్టు ఆఫీస్ జంక్షన్, బోయిన్‌పల్లి చెక్‌పోస్టు, మీదుగా సుచిత్ర మార్గంలో ఉండే జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారికి అడ్డం లేకుండా ఎన్‌హెచ్ సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలు, వయడక్టును నిర్మించడం ఉత్తమమని చెబుతున్నారు. ఇలా మార్చడం వల్ల బేగంపేట ఎయిర్‌పోర్టుకు దూరంగా మెట్రోకు ఎలాంటి అడ్డంకులు లేకుండా మేడ్చల్ వరకు తీసుకెళ్లే మార్గాలను అన్వేషిస్తున్నారు.

వై జంక్షన్‌గా జేబీఎస్...

ప్రస్తుతం జేబీఎస్ ఇన్ గేట్ వద్ద మెట్రో లైన్ నిలిచిపోయింది. ఇక్కడి నుంచి డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టి... నేరుగా సికింద్రాబాద్ క్లబ్ రోడ్డు మీదుగా నేరుగా శామీర్‌పేట మెట్రో లైన్‌ను, హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌తో అనుసంధానం చేయనున్నారు. అయితే నార్త్ సిటీ మెట్రో నిర్మాణంలో... భవిష్యత్‌లో జేబీఎస్ మెట్రో వై జంక్షన్ కీలకం కానున్నది. ఒక చీలిక మేడ్చల్ వైపు, మరో చీలిక శామీర్‌పేట వరకు పయనించనున్నది. దీనికి కనీసం 30 ఎకరాల భూమిని సమీకరించనున్నారు. జేబీఎస్ వద్ద రక్షణ, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భూ సమీకరణ సులభతరం కానున్నది.

బల్దియా పార్కు స్థలం కబ్జా

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనకాల 400 గజాల భూమిపై కన్ను

బంజారాహిల్స్, జనవరి 19: ఖరీదైన స్థలం కనిపిస్తే చాలు.. దాన్ని ఎలాగైనా కాజేసేందుకు కొంతమంది ఎత్తులు వేస్తుంటారు. అలాంటిది తమ ఇంటికి వెనకాలే ఖాళీగా స్థలం కనిపిస్తే ఊరుకుంటామా అంటూ.. జీహెచ్ఎంసీ పార్కు స్థలాన్ని తెలివిగా కాజేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనకాల పార్కింగ్ స్థలం ఉంది. దీన్ని ఆనుకుని సుమారు 400 గజాల జీహెచ్ఎంసీ పార్కు స్థలం చాలా ఏండ్లుగా ఖాళీగా ఉంది. కాగా, ఈ పార్కు స్థలానికి ఆనుకుని ఉన్న ప్లాట్ నం. 457లో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థకు చెందిన గెస్ట్ హౌజ్ ఉంది. తమ గెస్ట్ హౌజ్ వెనకాల చాలా కాలంగా ఖాళీగా కనిపిస్తున్న స్థలాన్ని ఎలాగైనా ఆక్రమించుకోవాలని నిర్ణయించుకున్న సదరు నిర్మాణ సంస్థకు చెందిన ప్రతినిధులు జీహెచ్ఎంసీ పార్కును తాము అభివృద్ధి చేస్తామని స్థానిక యూబీడీ విభాగం అధికారులను నమ్మించారు. సీఎస్ఆర్ కింద పార్కు చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని, పార్కులో పచ్చదనం పెంచుతామంటూ చెప్పారు. రాళ్లు రప్పలతో ఉన్న పార్కు స్థలాన్ని అభివృద్ధి చేస్తారని భావించిన స్థానిక యూబీడీ విభాగం అధికారులు.. ఇందుకు అంగీకరించారు.

- పార్కు అభివృద్ధి పేరిట రూ. 12 కోట్ల విలువైన స్థలం ఆక్రమణ
- ఓ నిర్మాణ సంస్థ నిర్వాకం..
- జీహెచ్ఎంసీ బోర్డును సైతం తొలగించిన వైనం

రూ. 12 కోట్ల విలువ..

పార్కు స్థలాన్ని చదును చేసిన సదరు నిర్మాణ సంస్థ ప్రతినిధులు.. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న ఖాళీ స్థలంలోకి గేటును సైతం ఏర్పాటు చేశారు. స్థలం లోపల, బయట జీహెచ్ఎంసీ పార్కు అంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి వరకూ అంతా సక్రమంగానే సాగింది. అయితే ఏడాది కిందట ప్రభుత్వం మారడంతో సదరు నిర్మాణ సంస్థకు ఈ పార్కు స్థలాన్ని కాజేయాలన్న ఆలోచన వచ్చింది. పార్కు అభివృద్ధిని పక్కన పెట్టి స్థలంలో కూరగాయలు పండించడం ప్రారంభించారు. తమ గెస్ట్ హౌజ్ నుంచి గేటు ఏర్పాటు చేసుకుని ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. పీఎస్ పక్కనున్న ఖాళీ స్థలంలోకి వచ్చేలా ఏర్పాటు చేసిన మెట్లను తొలగించారు. బయటి భాగంలో ఉన్న జీహెచ్ఎంసీ బోర్డును సైతం తొలగించారు. సుమారు రూ.12కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించుకున్న సదరు నిర్మాణ సంస్థ ప్రతినిధులపై చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడేందుకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ పార్కు స్థలంలో ఆకుకూరలు, కూరగాయలు పెంచుతున్న దృశ్యం

జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లో పోలీస్‌స్టేషన్ వెనకాల ఆక్రమణకు గురైన బల్దియా పార్కు స్థలం

శాంతి భద్రతలను కాపాడుకుందాం

- సిటీ కమిషనరేట్‌లో 573 ఏఆర్ కానిస్టేబుళ్లు
- వివిధ విభాగాలకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమే ..
- నగర కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న 573 మంది ఏఆర్ కానిస్టేబుళ్లను శాంతి భద్రతల విభాగంతో పాటు ఇతర విభాగాలకు అటాచ్ చేస్తూ నగర సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. లా అండ్ ఆర్డర్‌కు 284, ట్రాఫిక్ 225, మిగతా వాళ్లను ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ, సైబర్‌క్రైమ్ విభాగాలకు అటాచ్ చేశారు. ఇందులో 223 మంది మహిళలు, 350 మంది పురుషులు ఉన్నారు. ఈ మేరకు ఆదివారం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏఆర్ కానిస్టేబుళ్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ వీనీ ఆనంద్ మాట్లాడుతూ శాంతి భద్రతల విభాగంతో పాటు ఇతర విభాగాలను మరింత మెరుగు పరచడంలో భాగంగా సివిల్ కానిస్టేబుళ్లకు అదనంగా ఏఆర్ కానిస్టేబుళ్లను ఆయా విభాగాలకు అటాచ్ చేస్తున్నట్లు తెలిపారు.

నగరంలో ప్రశాంతత ఉన్నప్పుడే..

ఇక నుంచి సివిల్ పోలీసులతో కలిసి ఏఆర్ పోలీసులు పనిచేయాలని సీపీ సూచించారు. చాలా సహనంతో, వివిధ వర్గాల ప్రజల మధ్య పనిచేయాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ రాజధాని కావడంతో శాంతి భద్రతలను కాపాడుకోవడం మనందరి ముఖ్య కర్తవ్యమన్నారు. ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమేనని, వారికి సీనియార్టీ లేదా విభాగ మార్పిడి హక్కులు ఉండవని, పోలీస్‌స్టేషన్లలో పెట్రోలింగ్, ప్రాథమిక విధులు నిర్వహించే సిబ్బంది సివిల్ పోలీసుల కొరతను అధిగమించడానికి ఈ విధంగా అటాచ్‌మెంట్ చేస్తున్నామన్నారు. నగరంలో ప్రశాంతత ఉన్నప్పుడే పెట్టుబడులు వచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, నగరానికి తద్వారా రాష్ట్రానికి మంచిపేరు వస్తుందన్నారు.

చేయని పనులకు బిల్లులు

జీహెచ్ఎంసీ నిర్వహణ పనుల్లో అక్రమాలు

- కొందరు ఏజెన్సీలు, అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదులు
- అంతర్గత విచారణకు రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- ఇక మీదట అక్రమాలకు తావు లేకుండా జోనల్ కమిషనర్ అనుమతి ఉంటేనే బిల్లులు

సిటీబ్యూరో, జనవరి 19 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో జరుగుతున్న నిర్వహణ పనుల్లో అక్రమాలకు తావులేకుండా దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బడ్జెట్ కేటాయింపుల నుంచి బిల్లుల చెల్లింపు వరకు సమగ్ర పరిశీలన చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే జోనల్ కమిషనర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు , సంబంధిత డీడీఓతో కలిసి ప్రత్యక్షంగా పనులు పరిశీలించి అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న విధానాలకు అదనంగా వీటిని తప్పకుండా పాటించాలని కమిషనర్ ఇలంబర్తి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. పనులకు సంబంధించిన బిల్లులు రూపొందించే సమయంలో జోనల్ కమిషనర్ల ఆమోదం తప్పనిసరి చేశారు. ప్రతి బిల్లునూ జోనల్ కమిషనర్లు పరిశీలించిన తర్వాతే ఆడిట్‌కు పంపాలని, ఈ క్రమంలో నిర్ణీత విధానాలు పాటించారా? లేదా? అన్నది చూడనున్నారు.

ఫిబ్రవరి 3న జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఫిబ్రవరి 3న సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాస్తవంగా ప్రతి మూడు నెలలకోసారి సర్వసభ్య సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) జరగాల్సి ఉంది. గత జూలై 6న జరిగిన 9వ పాలకమండలి (సర్వసభ్య సమావేశం) అక్టోబర్‌లో జరపాల్సి ఉంది. కానీ ఐదు నెలలు గడిచినా సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు కమిషనర్, మేయర్ సిద్ధపడలేదు. ఎట్టకేలకు వచ్చే నెల మొదటి వారంలో జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 150 ప్రశ్నలతో పాటు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన ఆర్థిక సంవత్సరం (2025-26)కు సంబంధించిన రూ.8440 కోట్ల బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేక చర్చ జరగనున్నది.

రెండేండ్ల పనులపై నిఘా

జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు రూ.1500కోట్ల మేర బకాయిలు పడింది. ఈ నేపథ్యంలో తరచూ ఆందోళనలు చేయడం, జూన్ నాటికల్లా రూ. 400కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా నిరసనను వాయిదా వేశారు. అయితే ఇటీవల జరిగిన వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు కమిషనర్ దృష్టికి వచ్చాయి. చేయని పనులకు బిల్లులు పెట్టడం, గతంలో కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ఖజానాను గండి కొట్టారన్న ఆరోపణల నేపథ్యంలో పాత బిల్లులపై నిఘా పెట్టి తనిఖీలు చేయాలని కమిషనర్ అంతర్గత ఆదేశాలు జారీ చేశారు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన నిర్వహణ పనులకు చెల్లించిన బిల్లులపై విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టనున్నది.

ఎంపిక పారదర్శకమేనా.?

- పథకాల ఎంపికలో అర్హులకు చోటు దక్కుతుందా అనే అనుమానాలు
- నామ మాత్రంగానే వార్డు, గ్రామ సభల నిర్వహణ అంటూ ప్రచారం
- ఆందోళనలో అర్హులు.. వివిధ పథకాలకు లక్షలో దరఖాస్తులు

మేడ్చల్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): గ్యారంటీల అమలుకు పథకాల ఎంపికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభల నిర్వహణ సజావుగా జరుగుతుందా అన్న అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో నాలుగు పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలను అందించేందుకు ఈ నెల 21 నుంచి 24 వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో అర్హుల ఎంపికపై గ్రామ, వార్డు సభలను నిర్వహించనున్నారు. సభల నిర్వహణతో అర్హులకు న్యాయం జరుగుతుందా లేదా అన్న సందేహాలను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక జరిగిపోయిందని జరుగుతున్న ప్రచారంతో సభల నిర్వహణ నామ మాత్రంగానే జరగనుందా..? అన్న చర్చ జరుగుతున్నది.

జిల్లాలో వ్యవసాయ భూముల పరిశీలనలో అధికారులు(ఫైల్)

21 నుంచి..

21 నుంచి 24 వరకు జరిగే గ్రామ, వార్డు సభల్లో అభ్యంతరాలను పరిశీలించి లబ్ధిదారుల జాబితాను రూపొందిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ దరఖాస్తుదారుల్లో నమ్మకం కలగడం లేదు. 26 తర్వాత అందించే నాలుగు గ్యారంటీల పథకాలపై అధికారులు సర్వే పేరిట మాత్రం హడావుడి చేస్తున్నారు. గ్రామ, వార్డు సభల నిర్వహణలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తే అర్హులుగా లేని వారిని జాబితా నుంచి తొలగించే అవకాశం ఉంటుందని చెబుతున్నా.. వివిధ పథకాల్లో తాము చెప్పినట్లే లబ్ధిదారుల జాబితా ఉంటుందనే ధీమాతో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అర్హుల ఎంపికలో అధికారులు కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి ఏ మేరకు ఎదుర్కొన్నరన్నది లబ్ధిదారుల ఎంపిక తర్వాత తేలనున్నది.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

భూమి లేని నిరుపేద కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేల ఆర్థిక సాయాన్ని రెండు విడతలుగా అందించేలా లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తుల దారుల వివరాలను సేకరిస్తున్నారు. గత ఏడాది ఉపాధి హామీ పథకంలో అత్యధిక రోజులు పనిచేసిన వారిని అర్హులుగా గుర్తించే పనిలో ఉన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని రెండు విడతలుగా అందించనున్నారు. జిల్లాలో 18,204 మందికి ఉపాధి జాబ్ కార్డులు ఉండగా, 19,242 మంది కూలీలు ఉన్నారు. ఇందులో ఎంత మందిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

50 శాతం భూములకు కట్..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 50 శాతం భూములకు రైతు భరోసాను కట్ చేయనున్నారు. జిల్లాలో 40, 975 మంది రైతులు ఉంటే.. 82,020 ఎకరాలు వ్యవసాయ భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. ప్రతి ఏడాది వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో 22 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు చూయిస్తున్నారు. దీంతో సగానికి సగం పైగా రైతు భరోసాను రైతులకు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు పథకం ద్వారా రూ. 79 కోట్ల నగదును రైతు ఖాతాల్లో జమ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒకటైన రుణమాఫీ జిల్లాలో 3,602 మంది రైతులకే అయ్యిందన్న విషయం తెలిసిందే.

1.43 లక్షల దరఖాస్తులు

ఇందిరమ్మ ఇండ్ల పథకం, రేషన్ కార్డుల జారీలో అర్హులను ఎంపిక చేస్తారా అన్న అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి 1.43 లక్షలు, రేషన్ కార్డులకు 1.22 లక్షల దరఖాస్తులను ప్రజాపాలనలో స్వీకరించిన విషయం తెలిసిందే.